

# ఐ యామ్ రియల్లీ సారీ

నడిమింటి జానకిరాం

"కౌసల్యా సుప్రజా రామా పూర్వా........" వెంకటేశ్వర సుప్రభాతం రేడియోలో వినిపించేవేళ. పక్కింట్లో ప్రారంభమయాయి కేకలు. వాటి స్థాయి అలా పెరగటంతో సుప్రభాతం వినిపించటంలేదు. పక్కింటివాళ్ళ సంభాషణ వినాలన్న కుతూహలంతో రేడియో 'ఆఫ్' చేసి కిటికీ దగ్గరగా కూర్చున్నాను.

"అతనూ–నేను ఒకే ఆఫీసులో పని చేస్తున్నామని మీకు తెలుసు. ఇంటికి వచ్చిన వ్యక్తిని ఎలా పొమ్మంటాను.

లోపలకి పిలిచినంతమాత్రానికే ఇంతగా కేకలు వెయ్యాలా?" అది ఆమెగొంతు.

"అడ్డమైనవాళ్ళని ఇంట్లోకి పిలవటం నాకు నచ్చదు. మీ ఆఫీసు హెడ్‌క్లర్క్ నిన్నరాత్రి పదిగంటలతర్వాత వచ్చారు. ఈయన కోడికూసేవేళకి వచ్చారు. ఇవా వచ్చేవేళలు" అది అతని గొంతు.

"మీరనే మాటలు ఒక్కటీ మంచిగా లేవు. అంత విపరీతంగా ఆలోచించటం ఎందుకు? ఉద్యోగం చేసిన అప్పటి లక్షమందితో మాట్లాడవలసి వస్తుంది."

"వస్తుంది....ఎందుకురాదు. ఇంతకీ వాళ్ళ అవసరం నీకేం వుందని? నువ్వు చేస్తున్న నిర్వాకంకి తలెత్తుకతిరగలేకుండున్నాము. నా మిత్రులందరూ వెనక ఆడుతున్న గుసగుసలు వింటే నీ యధార్థరూపం నీకే తెలుస్తుంది"

"ఔను: మీ మిత్రులకేంపని: వాళ్ళందరూ మీ నిజమైన స్నేహితులే: ఒకడు పేకాట మిత్రుడు - మరొకడు క్లబ్బు స్నేహితుడు-వాళ్ళందరూ స్వార్థపరులే: మిమ్మల్ని బుట్టలో వేసుకొని కాద్దో గాప్పో స్వాహా చెయ్యాలని మీ చుట్టూ తచ్చాడుతున్నారు. ప్రతివాళ్ళని విమర్శించి ఎకసెక్కాలాడటం వాళ్ళకి చేతనవును. ఆ చీడపురుగుల్ని చూస్తే నాకు ఒళ్ళుమంట."

"చేతకానివాళ్ళకి శౌర్యం బోలెడు. నేను వద్దన్న పని నువ్వు మానెయ్యాలి. లోకులు అసహ్యించుకొంటూంటే ఈ నికృష్టపు బ్రతుకు....ఛీ....అసహ్యం"

ఫోన్ : 470

దుర్గా సిల్క్ ప్యాలెస్

సిల్క్, ఉలెన్ అండ్ కాటన్ పీస్-గూడ్స్ మర్చెంట్స్


మెయిన్‌రోడ్డు : : రాజమండ్రి-1

మేనేజింగ్ పార్టనర్. దుర్గా వెంకటరమణారావు

దుర్గా శారీస్ పేరడైజ్

(లేడీస్ ఎయిర్ కండీషన్డ్ షోరూమ్)

ఫ్యాన్సీ అండ్ వెడ్డింగ్ శారీస్ స్పెషలిస్టులు




"ఎవరికి అసహ్యం అయినా నాకేం ఖాతరులేదు. మంచి అని గుర్తించిన తర్వాత ఏ పనికీ నేను వెనుకాడను. ఎవరి దయాదాక్షిణ్యాలపై నేను బ్రతకటంలేదు."

"నోర్మూయ్...." అని అతను అనేసరికి ఆమె కేకలు తారాస్థాయి కెక్కాయి. 'ఫడీఫడీ'మని శబ్దం అయింది బహుశా అతను కొట్టేవుంటాడు. ఆమె ఏడుపు వినిపిస్తోంది.

* * *

నేను ఎం. ఎ. విశాఖపట్నంలో చదువుతున్న రోజులవి. నేనుండే అద్దె గది ప్రక్కనే శర్మ వుండేవాడు. అతని భార్య లతిక. అతనికి మనోరమ టాకీస్ దగ్గర మెడికల్‌షాపు వుంది. లతిక బ్యాంకులో ఉద్యోగం చేస్తోంది.

రోజూ లతిక ఇంటికి వచ్చేవేళకి ఆ ఇంట్లో తగవులాట ప్రారంభం అవుతుంది. అయినా ఆమె ఉద్యోగం చేసే అవసరం-ఇలా కీచులాడుకోవటం ఎందుకో నాకు అర్థంకాలేదు.

లతిక అందంగురించి రాయటమెలాగో నాకు తెలీదు. ఒకటిమాత్రం నిజం. నిండువిగ్రహంతో చూసేవారి మనసు ఆకట్టుకొంటుంది.

ఓరోజు నేను రెండో ఆట సినీమా నుంచి వచ్చేవేళకి శర్మ ఇంట్లో ఇంకా లైటు వెలుగుతోంది. మెల్లగా తలుపు తీసి కిటికీదగ్గర కూలబడ్డాను. అక్కడ కూర్చొంటే వాళ్లింట్లో మాటలు నాకు 'క్లియర్'గా వినిపిస్తాయి.

"బియ్యం లేవు. రేపు తీసుకురండి. సంసారం అన్న తర్వాత ఎన్నో పొరపాట్లు దొర్లుతూంటాయి. మీరు కొద్దిగా శాంతం వహించాలి"

"లతిక! నేను ఏవఝువా తేను. నీ జీతం కానీ పైసలతో లెఖ్ఖలన్నీ చెప్పాలి. అలా చెయ్యకపోతే నీకూ నాకూ ఎలాంటి సంబంధమూ లేదు"

"భార్యాభర్తల సంబంధాలు అంత సుళువుగా తెగేవికాదు. ఆ డబ్బుగురించి మీరేం అన్నారో గుర్తుచేసుకోండి"

వాళ్లింకా మాట్లాడుతున్నారే కాని

నాకు నిద్ర ముంచుకొస్తోంది. తెలతెల వారుతుందనగా పెద్ద కేకలు వినిపించే సరికి నాకు మెలకువ వచ్చేసింది. లతికను బయటకు నెట్టి తలుపు మూసేశాడు. ఆమె పరిస్థితిపై జాలి-అతనంటే అసహ్యం కలిగింది. మరో క్షణంలో స్కూటరుమీద బయటకు పోయాడు.

ఆమెకు ఆదుకోమని నా మనస్సు ఘోషించింది. శర్మ లేని సమయంలో ఆమె నాతో చాలా ఫ్రీగా మాట్లాడేది. అన్నిటికి శర్మ అనుమానాలే! పాపం! ఎన్నాళ్లని చిత్రహింస భరిస్తుంది. ఈ బాధలనుంచి లతికకి విముక్తి ఎప్పుడు లభిసుందో! లతిక దౌర్భాగ్యంని తలచుకొంటే నాకు బాధ కలిగేది.

ఎలాగైనా పది కేజీ.ల బియ్యం తెచ్చిపడేస్తే బాగుండు ననిపించింది. లతికకి ఈవిధంగా సహాయం చెయ్యాలనే వాంఛ కలిగింది. బజారుకెళ్లి బియ్యం తీసుకొని వచ్చాను.

"థేంక్యూ వెరీమచ్" అంది లతిక బియ్యం తీసుకొని ఆమెను-ఇంటిని పరిశీలనగా చూస్తూ నిల్చొన్నాను.

"కూర్చోండి. నిలబడే వున్నారు" అంది ఆమె. ఎంత నమ్రత!

ఆమె గురించి ఆలోచిస్తుండేసరికి శర్మ స్కూటరుమీంచి పడ్డాడని కబురు తెలిసింది. ఆమె గాబరా వర్ణనాతీతం.

లతికను తీసుకొని ఒక్క పరుగులో హాస్పిటలు చేరాను. రెండురిక్షాలు పిలుస్తుంటే 'ఎందుకు ఒకటి చాలు' అని ఆమే అంది. ఇలాశర్మతో నా పరిచయం ఎక్కువయింది. వారంరోజులు హాస్పిటలుకి వెళ్లి రావటం వల్ల మా మధ్య ఎక్కువమాటలు జరిగేవి.

"శంకరంగారూ! మీ కెవరైనా 'లాయరు'ని తెలుసా! తెలిస్తే నాకు కొద్దిగా పరిచయంచెయ్యండి. మీ మేలు జన్మలో మరచిపోను" అన్నాడు శర్మ. అతనికి లాయరు ఎందుకో నాకు అర్థం అయింది. లతికనుంచి విడాకులు కోరు కొంటున్నాడని తెలిసింది. కొద్దిగా చెప్పటానికి సంశయిస్తున్నాడు. లతికకి ఈ నరకంనుంచి విముక్తి లభిస్తే అదే పదివేలు!

"సరే...." అన్నాను శర్మతో.

* * *

లతికని బజారులో చూశాను. శర్మ చెప్పిన సంగతి విని ఆనందించి తీరుతుంది. కుళ్లిపోట్లు పోతున్నందుకు మురిసిపోతుంది. 'కాఫీ తాగుదాం' అనగానే ఆమె అభ్యంతరం చెప్పకుండా వచ్చింది.

"శర్మగారు 'లాయర్ని' సంప్రదించారు. మీరు మాత్రం ఎన్నాళ్లని సహిస్తారు. మీకీ విధంగా సహాయపడుతున్నందుకు గర్వంగా వుంది" అన్నాను.

ఆమె తృప్తిగా నవ్వింది.

మీకు పెళ్లిఅవలేదు కదూ?" అంది.

ఆ ప్రశ్నకి అర్థం నాకు బోధపడింది.

"ఇంకా కాలేదు" అన్నాను.

"పదండి వెళ్దాం" అంది మాట మారుస్తూ.

ఆమెను తాకుతూ లేచినిల్చొన్నాను. ఆమె మళ్లీ నవ్వింది. ఇద్దరం ఇంటి

దాకా చేరాం, ఏదో మాట్లాడాలని తాప త్రయం-ఏదో ప్రకాశం చెయ్యాలని కోరిక-కానిమాటలు వెదకేసరికికే సమ యం మించింది.

సాయంత్రం యింటికి చేరిన లలిత నా గది వైపే వస్తోంది. నా గదిలోలైటు వేయలేదు. కిటికీదగ్గర నిల్చొని నన్ను రమ్మని సైగచేసింది. నా మనస్సులో వేయిగుర్రాలు పరుగెత్తుతున్నాయి. నా కోరికలు ఉప్పెనలా ముంచుకొస్తున్నా యి. నాశరీరంలోనరాలన్నీ పనిచేయటం మొదలెట్టాయి.

ఆమె మెత్తనిచేతులు నాకుతగిలాయి ఆమె మరీ దగ్గరగా వచ్చింది. నేను.... నేను ....

నాబుగ్గమీద లతిక'ఫకీ'మనికొట్టింది ఒక్కసారి కాదు కనీసం పదిసార్లు! నా బుర్ర తిరిగిపోతోంది. నా కాళ్ళు తేలి పోతున్నాయి. నా నోట మాట రావటం లేదు.

"బియ్యం తెచ్చారు. డబ్బులు పుచ్చు కున్నారు కాదు. మీ డబ్బుతో తెచ్చారని యివాళే తెలిసింది" అంది డబ్బులు వుంచి. రెండడుగులు ముందుకు వేసి మళ్ళీవచ్చి "ఐ యామ్ వెరీసారీ" అంది నవ్వుతూనే.

* * *

నిద్ర ఎక్కడో మాయం అయింది. ఏదో చెప్పలేని బాధ. కిటికీమూస్తుంటే శర్మ ఏదో అంటున్నాడు. మళ్ళీ వినాలని పించి కిటికీ మూయలేదు.

"లలితా! నన్ను మనస్ఫూర్తిగా క్షమించు. యిన్నాళ్ళు నీ జీతం పూర్తిగా మా అమ్మకి, నాన్నకి యిస్తుంటే నీ మంచినిగుర్తించలేకపోయాను. నీలాంటి భార్య లభించినందుకు నా జన్మ సార్థక మయింది.

నీ నిస్వార్థబుద్ధికిజోహారు. ఈ గాయం మానటానికి నేను మరో రెండునెలలు మంచంమీద వుండాలట! మెడికల్‌షాపు మూసెయ్యటం ఎలాగ అని ఆలోచిస్తు న్నాను. ఓ పీడకల ముగిసింది. నీ మన స్సును కష్టపెట్టాను. నన్ను క్షమించు లతికా" అన్నాడు శర్మ.

"మీరు నాకేం కష్టపెట్టారు.... మనలో మనకు క్షమాపణలు ఎందుకండీ! ఉద్యో గంకి రాజీనామా యిచ్చి యిద్దరం మెడి కల్ షాపు చూసుకుందాం. అత్తయ్యని మామయ్యని యిక్కడికే తెచ్చుకుంటే మనకింత ఖర్చుండదు. ఏమంటారు?"

"నువ్వు నా అదృష్టానివి"అని ఇంకా ఏమో అంటూ శర్మ లేవబోతుంటే లతిక వారిస్తూ అతనిపై వాలి ముద్దుల వర్షం కురిపించటం లైటు వెలుగులో నాకు కనిపించక పోలేదు.

చెంపలమీద పడ్డదెబ్బలు 'చూడొ' ద్దని ఆర్డరు జారీచేసినట్లయే సరికి కళ్ళు మూసుకొన్నాను. అంతేకాకుండా మరే 'యిద్దరిమధ్య' పొరపాటున దూరకూడ దని ఏకగ్రీవంగా శపథం చేసుకొన్నాను యిలా నేను చేసినందుకు "ఐయామ్ రియల్లీ సారీ."